# నవలారత్నం

వెంపటి నాగభూషణం

౧

ఆ సాయంత్రం క్లబ్బునుంచి యింటికి తిరిగివచ్చి, రాకెట్ బల్లమీదపెట్టి దుస్తులువిడుస్తూ, అప్పుడే గదిలోకి వచ్చిన చిన్నితో అన్నాను— "ఘట్టుకాసైన తీర్మానం చేసుకున్నాం, చిన్నీ, యీవేళ. చెప్తే ఆశ్చర్యబోతావు." అని.

నావంక టక్కరుగా చూస్తూ — "ఎందు కాశ్చర్యబోతాను. మీ "ఇచ్ఛాజీవుల" వెర్రివేషాలకు అలవాటుపడ్డదాన్నేగా......ఏమిటి తీర్మానం?—ఆ పార్టీనిఘరించేగా?" అన్నది చిన్ని. ఇచ్ఛాజీవుల్ని గూర్చి తరుచు చిన్నిచేసే హేళనకు, హాసానికి అలవాటుపడ్డనాకు చీకాకుకల్గలేదు. ఓవిధమైన నూతనోత్సాహంతో చెప్పాను. "కాదు, చిన్నీ ... అంతా అంటున్నారు, 'ఇచ్ఛాజీవులు' వ్యర్థజీవులని...అందుచేత మాశక్తిసామర్థ్యాలు లోకానికి వెల్లడి అయ్యేటట్టుగా, ఓపని చెయ్యడానికి నిశ్చయించుకున్నాం..."

"అందరూకలిసి ఓమారు అన్నివీధులకుండాను వూరేసతారా?" అని అడ్డంవచ్చింది...

"...కాదు, చిన్నీ, విను. మా పేరు, మా ఆశయాలు, మా ఊహలు, మా స్వప్న-పరుగులూ- అన్నీ చిరస్థాయిగా వుండేటట్టుగా ఓనవలని రచించడానికి తీర్మానించుకున్నాం...శాశ్వతంగా- ఆచంద్రతారార్కంగా......"

"........వంశాభివృద్ధిరస్తు."

"మా 'ఇచ్ఛాజీవుల' నామసంకీర్తం- జరిగిపోవాలి!"

"...........తత్వాలువ్రాసిన బ్రహ్మంగారి మోస్తరు!"

"........నువ్వేమన్నా అనుకో............ అల్లాజరిగితీరాలి..........అల్లాంటి నవలను తయారు జేస్తాం! ఏమనుకొన్నావో!"

"...........ఈపని యిదివరకే చేసివుండాలిసింది."

"సరే, బాగుంది..........సామెతచెప్పినట్టు కల్యాణఘడియరావద్దా దేనికైనా?"

"అయితే, యిహాపైమంతా దాన్ని వ్రాయడం- దిద్దడంతోనే సరిపోతుందన్నమాట."

"ఉఁహు. నాకొక్కడికేగాదు శ్రమంతా."

"నాకూడా పంచుతారాయేం కొంపదీసి?"

"ఉఁహు...నేను, శాస్త్రి, చౌదరి, కౌండిన్య- నలుగురంకలిసి వ్రాస్తాం నవలని...."

"ఒక్కరు సాధిస్తేచాలదూ- లోకాన్ని హత్య చెయ్యడానికి?...నలుగురి చేతులూ ఎందుకూ?..."

"కాదు, చిన్నీ...అందులో గమ్మత్తుఉంది... మామూలు నవలలో మోస్తరు ఒక్కరి భావాలే గాకుండా- నలుగురి అభిప్రాయాలూ, ఆవేశం, శక్తి- కలిసి ప్రచండంగా ప్రదర్శింపబడ్తాయి..."

"మైనూరు కూట్ మోస్తరు- ఓ చౌ చౌ సిద్ధం జేస్తారన్నమాట."

"...ఏమన్నా అనుకో...జరుగబోయేదదీ... అంతాపూర్తి అయింతర్వాత నీకే తెలుస్తుంది దాని గొప్పతనం..."

"...పూర్తికావడమెందుకు...ఇప్పుడే తెలుసు పర్యవసానం ఎల్లా పరిణమిస్తుందో-జీవితంలో సిసలైన అనుభవంలేని నలుగురు కొక్కిరాయలుజేరి- అయ్యవార్లంగార్ని చెయ్యబోతే..."

"అనుభవంకావాలా ఏం ప్రతిదానికీ... మా ఊహాపటిమ చాలు...ఎందుకు ముందుగా వాదన! నువ్వే చూస్తావుగా...త్వరగానే నెరవేరుస్తాం..."

"తొమ్మిదినెలలూ నిండకుండానే, పురుడు?"

"చాల్లెస్తూ, నేర్చుకున్నావు మాటలు...చేసే వాటిల్లో సహాయపడ్డంపోయి- అడ్డదిడ్డంకూతలు..."

"పోనీండి...అంతయిష్టం లేకపోతే- 'ఇచ్ఛాజీవుల' లిస్టులోంచి నా పేరు కొట్టెయ్యండీ."

"అసలు నిన్నందులో జేర్చుకొం దెవరు?"

"రక్షించారు...అయితే నవల పే రేమిటి?"

"ఇప్పుడేం చెప్పగలను...నలుగురం కలసి అన్ని విషయాలు అనుకోవాలి..."

"...అయితే, ఎప్పుడు భారసాల?..."

"ఊర్కోండూ......తెలివంతా వెళ్లబుచ్చుతున్నావ్...భోజనం తయారైతే వడ్డించమని చెప్పు వంటమనిషితో..."

"...నవలా ఉత్సాహంలో ఆకలిమాట మరపున పడ్డదేమో ననుకున్నా...వంటఅయి ఎంతసేపో అయింది...మీరు రావడమే ఆలస్యం..." అని నిష్క్రమించింది చిన్నీ... "అజ్ఞాతకవి" రచించిన "కిరణావలి" గీతాన్నొకటి సాగదీస్తూ:—

రావోయి రావోయి రతనాల మొలకా
ఈవలపు దాటగా నేనేరనోయి...
మోసమని తెలియకే
చేసన్న నిజమనీ
ఆసపడినాను గద,—
ఈసారి కైనాను ......
ఏమి తెలియని వయసు
నీమీద నే మనసు
జామైన నినుబాయ
జాలనని దయయుంచి...

* * * *

## ౨

నిర్ణయించుకున్నట్లుగా, మర్నాడు సాయంత్రం- అయిదుగంటలకి- నేను, చౌదరి, శాస్త్రి, కౌండిన్య, శర్మ- కాలువవొడ్డున కలుసుకున్నాం... ఆ 'నిరుపహతిస్థలంలో'- రమణీప్రియ ఎవరూ దూతిక తెచ్చియివ్వడానికి లేకపోయినా,- 'ఆత్మకింపయిన' టీ నీళ్లతో, ఉత్సాహమనే ఉయ్యాలలో వూగుతూ- నవలారచనకు ప్లాను వేసి- "రష్యాలూహ తెలియంగల పాళకోత్తముల్" మీద ఓ బ్రహ్మాండమైన గ్రంథాన్ని విసిరి వెయ్యాలని సంకల్పం.

డ్రెమన్ సర్దార్ శర్మ మా మీటింగులు జరుగుతూన్నంతకాలం సెక్రటరీ. పెద్దప్లాస్కులో టీ, ఓటిరెండు గోల్డుఫ్లేక్ సిగరెట్టుటిన్‌లు పట్టుకు రావడం, ప్రతి మీటింగులోను మేంచేసిన తీర్మానాలను ఓపుస్తకంలో వ్రాయడం అతనిపని. శర్మకు అల్లాంటి పనంటే సరదా. అంతకుమించిన ఆశయాలూ లేవు. మాకు ముద్దుకు పనికివచ్చిన మనిషి...

ముందుగా నలుగురం తలో కప్పు టీ సేవించి, తలో సిగరెట్టు ముట్టించి, వలయాకృతిగా కూర్చున్నాం కర్తవ్యానికి ఉపక్రమించడానికి. కాగితం, కలం సిద్ధం జేసుకొని శర్మ ఆరంభప్రార్థన చేశాడు.

పరిత్రాణాయ షైనార్టున్
వినాశాయచ జోకులుం,
టీజాతిన్ స్థాపనార్థాయ
సంభవామి యుగే యుగే!

ఆహుమారు వాతావరణంలో, నడుములు బిగించి చేతులు జాడించి, ఊహలువిప్పి, తయారైనాం.

"ముందుగా ప్లాట్, అదే, కథావిధానాన్ని స్థిరపరచుకొని, తర్వాతకాండ తర్వాత ఆలోచిద్దాం. అది మంచిదని తోస్తుంది" అన్నాడు శాస్త్రి నవలా ధోరణి సూచిస్తూ...

"దివ్యమైన సలహా...ఏఏ విషయాలు రావాలో వ్రాయడంలో, బాక్‌గ్రౌండు ఎలావుండాలో, పురాణ

సంబంధమైనదో, చరిత్రాంశమైనదో, మతైకమో, సాంఘికమో, రాజకీయమో, లేకపోతే అన్నీకలిసి కొద్దికొద్దిగా వుండాలో, ఒక భాగంచాలో, లేకనవల రెండుమూడు భాగాలుకలదిగా వుండాలో, యీ ప్రిలిమినరీ విషయాల్ని ముందు అనుకుంటే బాగుంటుంది." అని శాస్త్రిసూత్రానికి చేయూత యిచ్చాడు చౌదరీ.

అప్పుడు నేనన్నాను: "అదేవుత్తమమైన పద్ధతని తోస్తుంది... కాని, వెనుకటి కాలానికి సంబంధించిన కథవ్రాస్తే అంతగా నచ్చదు ఎవరికీని. ఈ ఆధునిక యుగానికి సంబంధించిన జీవితాన్ని నిరూపిస్తూవుంటే ఎంతైనా ఎపీలింగుగా వుంటుంది అని నావుద్దేశ్యం."

ఇంతవరకూ ధూమకాష్ఠంమీదేదృష్టిని కేంద్రీకరించిన కౌండిన్య అందుకొని "అసలు నవలయొక్క వుద్దేశ్యమేమిటో ముందు నిరూపించండి" అన్నాడు.

అంతా తెల్లముఖాలు వేశారు. ఆ విషయం ఎవ్వరికీ తట్టనేలేదు. శాస్త్రి మెల్లగా మరో సిగరెట్టును ముట్టించాడు. "ఓటి యిల్లాగూడా దానం చేసుకుంటే ఏంపోయిందీ" అని చౌదరీగూడా వెలిగించాడు.

కౌండిన్యసలహా సబబైనదేనని తోచి నేనన్నాను: "అది ముఖ్యమైన పాయింటే...కాని కళలో వుద్దేశ్యమనేదానికి ప్రత్యేకత యివ్వకూడదు. మామూలు జీవితంలో, ఏదన్నా వుద్దేశ్యంపెట్టుకు పనిచేస్తే సమంజసంగా వుంటుందిగాని, ఫైన్ ఆర్ట్సులో అల్లాంటి నిబంధన వుండకూడదు. కవి గీతంవ్రాసినా, చిత్రకారుడు బొమ్మగీసినా, వాటివుద్దేశ్య మేమిటో తెలుసుకోడం చదివేవారిది, చూచేవారిది. అసలు ఆర్టిస్టు ఐనవాడికి అల్లాంటి ఆలోచనే వుండకూడదు. ఉత్సాహాన్ని, ఊహానిబట్టే రచన ఏవిధంగా సాగితే అల్లాసాగనియ్యాలి. అదీసిసలైన కళావిధానం, కళానైపుణ్యం. కాబట్టి నవలా వుద్దేశ్య మేమిటో ఓంప్రథమంలోనే అనుకోడం అనవసరం అని మనవిచేస్తున్నాను."

చూపులకు అడ్డర వస్తూన్న ధూమాన్ని ఎడంచేత్తో విరజిమ్ముతూ శాస్త్రి. "భేష్గా విశదీకరించావ్, మిత్రమా ఐతేమని, ద్రాడో పేడో తేల్చడంలో ఘట్టివాడవు. అందరిమో స్తరూ వుద్దేశ్యమేమిటో ముందే అనుకోకుండా, నవలను వ్రాయడమనేది "ఇచ్ఛాజీవుల" తత్వానికి టిపికల్‌గావుంటుంది. భూషన్ చెప్పిందాన్ని నేను రెండు, అదే, సెకండ్ చేస్తున్నాను....కాబట్టి యిక నవలా వస్తువు, అదే థీమ్, ఏమిటో ఆలోచించండి" అన్నాడు.

సమ్మతిమాపులు చూచారు అందరూ.

ఇక చౌదరీవంతు: "టాపిక్ విషయంలో నాకు తోచింది చెప్తున్నాను: మననవల నూతనంగా వుండాలి కాబట్టి, దాన్లో నూటిపోట్లువుంటేనేగాని బాగుండదు. అదెల్లాగ వస్తుందీ అంటారేమో, ఉదాహరణకు చెప్తున్నాను: ఇప్పుడు, రామాయణంవుంది: సీతాదేవిని రావణుడు బలవంతంగా అపహరించుకు పోయినాడు. అది వాల్మీకాదులు అన్నది. అల్లాకాకుండా: సీత రాముడితో అడవిలో కష్టాలు పడలేక రావణుడితో దొంగఎత్తుమీద లేచిపోయిందని ప్రూవ్ చేస్తామనుకోండి... అప్పుడు, అటు పురాతన నమ్మకాన్ని బాంబ్ చేసినవాళ్లం అవుతాం, యిటు ఫ్రీలవ్ సూత్రాన్ని ప్రచారం చేసినవాళ్ల మౌతాం...అల్లాగే అహల్యకథ: ముసిలిమొగుడితో కాపురం యిష్టంలేక, మరి యిద్దరిమగ్గరితో ప్రణయకాండ జరిపిందని రుజువుచెయ్యొచ్చు. అల్లాంటిదే తారా చంద్రులకథ. ఇంకా వందలు పురాణానికి, యితిహాసానికి సంబంధించినవి. అందరూ మనల్ని మెచ్చుకోక పోవచ్చు కాని, వస్తువు క్రొత్తగావుండడం చేత తప్పకుండా చదువుతారు. ఇదీ నాకు. తోచింది"

ఆ అభిప్రాయానికి ఓత్రోపుయిస్తూ, కౌండిన్య "అవును- మనవాడు జ్వాలానందస్వామి చెయ్యాలా, 'అశోకం' లో" అన్నాడు ..

శాస్త్రి నావంక మాశాడు—"నీ అభిప్రాయ మేమిట"న్నట్లుగా. చౌదరీ చెప్పింది నాకు నచ్చకబట్టి అన్నాను. "లేదు భాయ్. అది అంత సీదాపని అని నాకు తోచడంలేదు. ఇంకా ఎందుకు ప్రాతవాట్ని బట్టుకు దేవుళ్లాడడం, అవ్వనుబట్టుకు వసంతాలాడినట్టు...మనకు వాటిల్లో ఎల్లాగూ నమ్మకం లేదు.

వాటిల్లో విశ్వాసమున్నవాళ్లను మనం మార్చనూ లేము. వాటిని నిర్లక్ష్యంతో చూడ్డంలోనే వుందిగాని మన గొప్పతనం, వాటిచెంగుపట్టుకు ప్రాకులాడ్తే యిక మన ప్రయోజకత్వం ఏముందీ? ఇంతకూ మనకు ఒరిజనాలిటీ లేకపోతేగద, పాత థీంసునుపట్టుకు వాళ్లాడ్డం. మన చుట్టూ జీవితం నురుగులుగ్రక్కుతూ పరుగెత్తుతోంది ...తెలివితోచూస్తే కావలసినంత మెటీరియల్ దొరుకు తుంది. సృష్టినిచేసి లోకాన్ని ఆకర్షించాలిగాని ... యింకా రామాయణాన్ని, భారతాన్ని బ్రతిమాలడం ఎందుకూ? "

నేనేదో పెద్దఘనకార్యం చేసి అభినందనానికి అర్హుణ్ణి అయినట్టుగా, నాబుజం తట్టుతూ, శాస్త్రి:

భావకవితా మదనమోహన,

పిడుగుమాటల మెఱపురా!

అని మరో గోల్డుఫ్లేక్ అంటించాడు.

"అయితే నవలలో ఏవిషయాన్ని విశదీకరించ డం?" అని శర్మ ప్రశ్నించాడు.

కౌండిన్యకు కోపంవచ్చింది. చ్రురున అన్నాడు. "నేనొక పాయింట్ ఆఫ్ ఆర్డరు అడుగుతున్నాను. శర్మకు మనం మాట్లాడేదాంట్లో కల్పించుకోడానికి అధికారమేముందీ? ఏసంస్థయొక్క మీటింగు రికార్డుల నైనా చూడండి. వ్రాతపని, దస్తరం కాపలాపని తప్ప వేరేప్రసక్తి, జోక్యంలేదు సెక్రటరీకి...ఇక్కడా అల్లాగేనని తెలుసుకోవాలి శర్మ..."

శర్మ బిక్కమొహమేసి, టిన్‌లో మిగిలిన సిగ రెట్లెన్నో లెక్కపెట్టడం మొదలెట్టాడు.

చౌదరీ అన్నాడు అప్పుడు: "పాతవాటిని పున రుద్ధరించి, వాటినిగూర్చే వ్రాసితీరాలని నాపట్టుదల కాదు. సమకాలిక పరిస్థితుల్ని జీవితాన్ని గూడా ప్రతిబిం బింపవచ్చు నవల్లో... కాని నవయుగవైఖరి పలుముఖా లుగావుంది. ఏవొక్క విషయాన్ని గూర్చి ఎత్తుకున్నా తక్కినవి మరుగున పడిపోతాయి. ఉదహరణకుచెప్తాను. నవలని రాజకీయవిషయాల్లోంచి నడిపించుదా మనుకొం టామనుకోండి. అప్పుడు తక్కినవి అంటే సాహిత్యం, మతం మొదలయినవాట్ని విశదీకరించడానికి అవకాశం వుండదు. అప్పుడు మననవల వన్‌సైడెడ్‌ది అయిపోయి అందరికీ ఆమోదనీయంకాదు. ఈసమస్య ఎట్లా?..."

గొంతు సవరించుకొని శాస్త్రిపల్కాడు: "అల్లా నిస్పృహచెందుతే ఎల్లాగోయ్, మొక్కపోని ధైర్యం వుండాలిగాని. సులభంగా ఏకార్యంనెరవేరిందిచెప్పు— చరిత్రలో...అల్లాగే మననవలావిషయం గూడాను..."

శాస్త్రి ధర్మోపన్యాసం అవిచ్ఛిన్నంగా సాగి పోతుందేమో నసేభయంపుట్టి అడ్డుపడి అన్నాను నేను: "ఈశంకరాచార్యవుపన్యాసలకేంగాని, శాస్త్రీ, చౌదరీ సంశయాని కేంచెప్తావ్...అతనన్నదీ నిజమే. ఏదో ఒక్కవిషయాన్ని గురించిమాత్రమే మర్దనప్రారంభిస్తే, నవల బోరింగ్‌గా వుంటుంది. కాని ఎన్ని సమస్యలనని రూపుమాపగలం ఒక్కదాంట్లో..."

"అవును భూషన్. చాలావిషయాల్ని ఎత్తు కున్నామా, త్రాడూ కొసా లేకుండా, రంగులబొంతల్లే వుంటుంది నవల. ఉత్తరాదివాళ్ల కిచిడీలా తయారౌ తుంది. అల్లాంటిరసాభాసం మంచిదికాదు. కాని, నువ్వన్నట్టు, ఏవొక్కవిషయాన్ని మాత్రమే ఊకదం పుడు సాగించామా, పసందు వుండదు...గొప్పచిక్కు వచ్చిందే మొదట్లోనే...కాస్తబుర్రపెట్టి ఆలోచన చెయ్యి...నాలుగు చదివినవాడవు, నాలుగు చూసిన వాడవు...నువ్వే కాస్త ఏమన్నా సాధించగల్గితే....." అన్నాడు శాస్త్రి...

అతని స్తుతివాక్యాలకో, లేక దానంతట అదో, ఓ ఆలోచన ఛప్పున తట్టి, అన్నాను: "చూడండి, అబ్బాయిలూ, ఓ తళుకుతోచింది...ఏమిటంటే..... చేతనైనంతవరకు చాలా సమస్యల్ని రప్పించచ్చు నవలలోకి. ఎల్లాగా అంటారేమో. మాటవరుసకి చెప్తాను...ఎం. ఏ. ప్యాసైనవాడు ఓడు కథానాయకు డనుకోండి...అతను కవి, కథకుడు అనుకోండి. సాహి తీలోకంలో పేరుప్రతిష్ఠలకు పనిచేస్తూ పెనుగులాడు తూంటాడు...తర్వాత, ప్యాసై రెండేళ్లయినా వుద్యో గం దొరకదు...దానికి పైపెచ్చు, అతను మనస్సులో

వలచిన లలన అతనంటే కించిత్తయినా అభిమానం చూపకుండా, మరొకణ్ణి పెళ్ళాడుతుంది.....దానాదీనా అతనికి పిచ్చెత్తినంత పనై—వ్యర్థంగా కాలం పుచ్చుతూ, కదాచిత్‌గా, రివల్యూషనరీలతో పరిచయం చేసుకుంటాడు. తన్మూలంగా ద్వీపాంతరవాసశిక్షకు పాత్రుడౌతాడు. బందీ అయివుండగా మనశ్శాంతికోసం మతంమీద మనస్సు పోనిస్తాడు. భగవద్గీత, దానికున్న గంపెడుభాష్యాలు తిరగవేస్తాడు. తత్ఫలితంగా విముక్తిఅయిరాగా, సాధువుగా మారిపోయి వేదాంతబోధ ప్రారంభిస్తాడు... ఆ విధంగా పోకడ తీశామనుకోండి...అప్పుడు... సాహిత్యం, నిరుద్యోగసమస్య, ప్రణయం, సాంఘిక అల్లకల్లోలాలు, రాజకీయ అలజడి, మతం, అన్నిటినిగూర్చి వరుసగా మన అభిప్రాయాలను వెల్లడించడానికి అవకాశం వుంటుంది. దీనికేమంటారు ?"

కౌండిన్య బదులు చెప్పాడు: "ఇంచుమించు అరవిందఘోష్ జీవితం సిద్ధమౌతుంది. అందులో మన ప్రత్యేకత ఏముందీ?" అని.

"దీనికేమిటి...సృష్టిలో లేనిదాన్ని కల్పించగలమా ఏం? వున్నదాన్ని మార్చి నూతనరూపం యివ్వగలరుగాని ఎవరైనా, అసలు కేవలం క్రొత్తదాన్ని, కని విని ఎరుగనిదాన్ని, ఎక్కణ్ణించి పుట్టించడం?... ఆ కల్పనలోనే మన అభిప్రాయాల్ని స్పష్టంగా బోధించవచ్చు...అందులో ఒరిజనాలిటీ చూపించడానికి కట్టుకుపోయినంత అవకాశం వుంది..." అన్నాను నేను...

చౌదరి నాతో ఏకీభవించాడు. "నువ్వన్నది నిజమేనోయ్. ఎంచేతా అంటే...మన సామర్థ్యం పోకడలో కన్పడాలిగాని, ప్లాట్ లో అంతగా కన్పించడానికి వీల్లేదు. కాని నాకో సందేహం. నువ్వు చెప్పినట్టుగా మొదలెడితే, నవల కొండవీటి చాంతాడౌతుందేమో రెండుమూడు వాల్యూములుగా వుంటే బాగుండదు"

శాస్త్రిగూడా ఆ అభిప్రాయాన్నే అంగీకరిస్తూ "అవునవును, ఒక్క భాగంలోనే పూర్తికావాలి నవల: నాకు తెల్సు. హిందీలో "భూతనాథ్" అనే యిరవై భాగాల నవలవుంది. తుదీమొదలూ లేకుండా విసువుపుడ్తుంది. నాలుగు పార్టులున్న "మాలపల్లె", గూడా అంతే." అన్నాడు.

"దానికేం, ఒక్క వాల్యూంలోనే ముగింపవచ్చు. అది మనచేతిలోవున్న పనే. విలువ సరుకులో వుంటుందిగాని పొడుగు వెడల్పుల్లో వుంటుందా ఏం?" అని నేను యింకేమో చెప్పబోతూండగా కౌండిన్య త్రోసుకు వచ్చి, "ఇంతకూ మన నవల స్వాభావికంగా వుండాలా, ఆదర్శప్రాయకంగా వుండాలా, అదే, రియలిస్టిక్‌గానా, ఐడియలిస్టిక్‌గానా ?- ఆవిషయం ఆలోచించలేదు. మనం." అన్నాడు.

"అవును, అదీ ఆలోచనీయమైన విషయమే" అంటూ శర్మవైపు తిరిగి మరోకప్పటికి కనుసైగ జేశాడు చౌదరి.

ఓ చిక్కుపైన ఓ చిక్కు వచ్చిపడ్తోంది. తక్కినవారు పాల్గొంటున్నా- యోచన, మాట్లాడ్డం ఎక్కువగా నావంతు అవుతున్నాయి. అప్పటికే కౌండిన్య వేసిన ప్రశ్న- ముఖ్యమైంది కాబట్టి, దాన్నిగూడా తేలుద్దామని శాస్త్రి స్వార్థత్యాగాన్ని ప్రదర్శిస్తూ అందిచ్చిన టీని త్రాగి- అన్నాను:- "ఇదిగొప్పసమస్యే. అయినప్పటికీ మనం ఎదుర్కొని తీరాలి... దృష్టి వెనక్కిమరల్చిచూస్తే, మనభారతజాతి లక్షణం, ఎప్పుడూ ఆదర్శంమీద దృష్టిని నిల్పడమేనని కన్పిస్తుంది... పాశ్చాత్యులది ఎప్పుడూ రియలిస్టిక్ దృష్టి... కాని రెంటినీ సమన్వయంచేసి ప్రదర్శించడం దుర్లభమైన కార్యంకాదు. వ్యక్తులకళ్ళు నక్షత్రాలమీదవున్నా కాళ్ళు భూతలంమీద వుండవచ్చు. అందులో అపభ్రంశమేమీ లేదు. రెండుపంథాలకూ వైరం లేదు. మనపూర్వకవుల రచనల్లో నిదర్శనాలున్నాయి. ఉదాహరణకు చెప్తాను: కాళిదాసు కల్పించిన కణ్వుణ్ణిచూడండి. అతనున్నది ఆముష్మికమార్గ మూలకమైన ఆశ్రమం. ఆజ్యము, హవిస్సు అంటూ ఎప్పుడూ తేలిముస్తుతూ ఉన్నతాదర్శ తేజఃపుంజాల్ని తనలో కేంద్రీకరించుకున్న

సాధకచక్రవర్తి. అయినప్పటికీ లోకసంగ్రహార్థ చర్యలను చేయగలవ్యక్తి...అనాథయైన శాకుంతలను ఏలోపమూ లేకుండా పెంచి పెద్దదాన్ని చేశాడు. తుద కావిడే దుష్యంతుడిదగ్గరకు పోతున్న సమయంలో కణ్వుడు చెప్పిన "శుశ్రూషస్వగురూన్" అనే శ్లోకాన్ని చూడండి...అందులో ఉపదేశం ఎంత లోకానుభవయుక్తంగావుందో...అల్లాగ ఇహపరాలకు కూడలియైన వ్యక్తిని, విషయాన్ని ప్రదర్శించడం కష్టసాధ్యం కాదు. రియలిజంని ఐడియలిజంనీగూడా మిళితంజేసి నవలలో ప్రసరింపజేయచ్చు—" అని ఎంతవరకు గ్రహించారో తెలిసికొందామని ఆగాను...

ముందు కౌండిన్య బయటపడ్డాడు "సరిగా తలకెక్కలేదు భాయీ నువ్వుచెప్పింది." అంటూ.

క్రొత్త సిగరెట్‌తో యిన్స్పిరేషన్‌కల్గి చౌదరి "అయితే, మహాశయా, మరోసందేహం. భారతజాతిని, కాళిదాసు కృతుల్ని ఉదాహరిస్తున్నావే? మననవలకు బాక్‌గ్రౌండు ఆంధ్రరాష్ట్రమా, లేక యావద్భారతవర్షమూనా? ఆ శంక తీరాలి ముందు." అన్నాడు ఉచ్చైస్స్వరంతో...

"అబ్బాయిల్లారా, మన అనుమానాలకు అంతు లేదల్లేవుందోయ్...పన్నెండువేల అడుగుల సినీమా రీల్ లాగ..." అని నిస్పృహని జారవిడిచాడు శాస్త్రి.

అందరం కొంచెంగా నిర్ఘాంత పోయిచూస్తూండగా శర్మ - "వీరుల్లారా వీరాగ్రేసరుల్లారా - జోక్యంకల్గించుకొంటున్నానని అపోహపడకుండా వుంటే చెప్తున్నాను - సిగరెట్ టిన్ సమాప్తమైంది. ఆపైన నన్ను సాధిస్తే లాభంలేదు" అన్నాడు.

దాంతో పిడుగు పడ్డట్టయింది. అగ్నికుండంలేందే వేదమంత్రం సాగనట్టు, సిగరెట్ లేందే సంభాషణ నడవదు, ఆలోచనపోదు. అందులోనూ తీవ్ర విషయాల్ని తర్కించేటప్పుడు సిగరెట్ విలువ చెప్పనే అక్కర్లేదు. అంచేత శర్మ దండోరావిని అందరూ శిలలించారు.

"లాభంలేదోయ్, సర్దార్...రేపటికి పోస్టుపోను చేదాం" అన్నాడు కౌండిన్య.

"రేపు శర్మ ఎక్కువ సిగరెట్లను తీసుకురావాలి" అని ప్రతిపాదించాడు చౌదరి. అందరం ఆమోదించాం ఏకగ్రీవంగా...

మెల్లగా లేచి గృహోన్ముఖులమైనాం వెన్నెల వింతని మెచ్చుకొంటూ.

* * * *

3

మర్నాడు, క్రిందటి దినం ఆక్రమించుకొన్న స్థలాన్నే, తిరిగి సభ ప్రారంభించాం. "చౌదరీ పదినిమిషాలు ఆలస్యంగా వస్తానన్నాడు." అని తెలియజేస్తూ, శర్మ, చేతులో పుస్తకాన్ని పైకెత్తి, "క్రిందటి మీటింగు మినిట్స్ చదివేదా?" అని అడిగాడు...

"ఎందుకులేస్తూ, నిన్న జరిగినవేగా, అన్నీ జ్ఞాపకమున్నాయి. నువ్వు జాగ్రత్తగా వ్రాస్తూంటే చాలు" అన్నాను నేను.

"అందుకో లోపమేమీ చేయను శర్మ... అయితే, శర్మా, సిగరెట్లమాటేమిటి, యీదినం" అన్నాడు కౌండిన్య.

"జాగ్రత్తపడ్డాను, బాబూ, ఆవిషయంలో... రెండుటిన్‌లు పట్టుకొచ్చాను, నాదేంపోయింది.... సుదర్శనం అప్పిచ్చేందుకు అభ్యంతరపెట్టనంతవరకూ తెస్తాను ఎన్నైనాసరే..." అంటూ టిన్ తెరిచాడు... ఆ వుత్సాహంలో అందరంతలొకటీ అందుకొని అంటిస్తూండగా—

శాస్త్రి: "అయితే, సర్దార్...ఎవరిఖాతాలో వ్రాయించావు?"

"ఎవరిదాంట్లో వ్రాయించడానికీ నాకేం హక్కు...టిన్‌లు యిమ్మని, పుచ్చుకొంటూ, మీ అందరిపేర్లూ ఏకరువుపెట్టాను... ఆపైన సుదర్శనం చిత్తం...వాడెవరిపద్దులో వ్రాస్తే వాళ్ళదీ బెంగ..." అన్నాడు శర్మ.

అందరిహృదయాల్లోనూ రాయి పడ్డట్టయినా, పొగపీల్చేమజాలో, పైకి ఏమీ అనాలేకపోయాం.

అంతలో చౌదరీ అవతరించి— "పాగతాగని వాడు దున్నపోతై పుట్టున్"....ఓటిల్లాగూడా దానం చేసుకోండోయ్ కళాకిశోరాల్లారా" అన్నాడు.

చౌదరీగూడా కూర్చున్న తర్వాత— "సభ్యులందరూ వచ్చారు, యిక సభ మొదలు పెట్టచ్చు" అన్నాడు శర్మ చోప్దారువైఖరితో...

శాస్త్రి ముందంజవేశాడు: "నాయకుల్లారా, నాదో సూచన...నిన్న రెండు గంటల చర్చలోనూ తేలింది ఆట్టేలేదు. తిరిగి వాటినే నలగవేయడంకన్న యీదినం ముందుగా నాయకుణ్ణిగూర్చి తేల్చుకుంటే బాగుంటుందని నాకు తోస్తోంది..."

అందుకంగీకరించాను నేను. చౌదరీగూడా సమ్మతివెల్లడించాడు కళ్లతో...

కౌండిన్య కొంచెమనుమానంగా: "నవల్లో, ముఖ్యత్వం నాయకుడికో, నాయకురాలికో ముందు నిశ్చయించండేనా?" అన్నాడు.

నేను బదులుచెప్పాను: "నాయికానాయకుల కిద్దరికీ సరిసమాన ప్రాముఖ్యం వుంటుందనే అంచనాతో ప్రారంభిద్దాం..."

"నాయకురాలే ఎందుకు ముఖ్యపాత్రగా వుండకూడదూ? అల్లావున్నవి, ఎన్నినవలలు, నాటకాలూ లేవు?" అని తిరిగీ అడిగాడు కౌండిన్య.

"లేవని ఎవరన్నారూ?...కాని మనమంతా, మగవాళ్లంకలిసి నవలవ్రాస్తూ స్త్రీకి పైచెయి యివ్వడం నాకంత సమంజసంగా తోచదు" అన్నాడు చౌదరీ...

"నాకూ అల్లాగనే తోస్తుంది.... ఇంతకూ మాటవరుసకి అనుకొని కొండసాగిద్దాం. కావాలంటే తర్వాత మార్పుచేయకూడదా ఏం?" అన్నాను నేను సమన్వయాన్ని బోధిస్తూ...

కౌండిన్య- "సరే. కానీండి" అన్నాడు...

ఇక నాయకుడి ప్రశంస:

"శాస్త్రీ, నీ అభిప్రాయమేమిటి?" అని అడిగాను.... అతను, వెలిగించబోతూన్న సిగరెట్టు మానేసి:-" ఆభారం నామీద రుద్దుతావని భయపడ్తూనే వున్నాను, మహానుభావా! నాయకుణ్ణి గురించి కావ్యకారకులు, అలంకారశాస్త్రజ్ఞులు ఏం నిర్ణయించారో కావాలంటే, అందుకు సంబంధించిన పాతసంస్కృత గ్రంథాలుమూచి, రేపు సవినయంగా మనవిచేసుకుంటాను." అని ఆపినపని పూర్తిచేశాడు....

"అసలు-పూర్వంలో -నాటకాలూ, కావ్యాలూ తప్ప మరోరకం గ్రంథాలులేవుగా. వాటి నాయకులకు కావలసిన లక్షణాలనునిర్ణయించివుంటారు పూర్వులు... అవి మన నవలానాయకుడికి ఎట్లా సరిపోతాయి అని నాకు కొద్దిమాత్రంసంకోచం" అన్నాడు చౌదరీ.

"దానికేం- నాయకుడు- నాటకంలో నైతేనేం కావ్యంలోనైతేనేం, నవలలో నైతేనేం, నాయకుడే. అంటే కొన్ని ప్రత్యేకలక్షణాలుంటేనేగాని నాయకుడుగాడు. అదీగాక అతనుచేసే చర్యల్నిబట్టీ, ఎదుర్కొనే సంఘటనాలనుబట్టీ- మొదలైన వాన్నిబట్టి అతను విజయుడుగానో - అవిజయుడుగానో పరిగణింపబడ్తాడు.... కాని కొన్ని వ్యక్తిగత లక్షణాలున్నవాడుగా వుండాలి." అని ముగించాను.

"సరే, అందుకు వొప్పుకున్నామనుకో...నాయకుడు ఉత్తముడుగా వుండాలా, నీచుడుగావుండాలా? అది అసలు ముఖ్యపాయింటని నానమ్మకం" అన్నాడు కౌండిన్య.

"ఉత్తముడుగా వుండడం, తనచర్యలతో యితరులకి ఆదర్శపూర్వకంగా వుండడం, అందరిచేతా 'ఆహా!' అనిపించుకోవడం మర్యాదగా వుంటుందని నా అభిప్రాయం" అని శాస్త్రి వెలిబుచ్చాడు.

నా కది సబబుగా తోచలేదు... "నీచుడుగా వుండిమాత్రం నలుగురిమెప్పును ఎందుకు పొందలేదు నాయకుడు?...ఉత్తముడైన, నీచుడైన, అతని సత్తానిగాని మనం గౌరవించిన, దూషించిన. అతని బుద్ధుల్నిగాదు...ఉదాహరణకు అంటున్నాను; ఒథెల్లో నాటకం

వుంది. అందులో అసలునాయకుడు ఐయాగోగాని ఒథెల్లోకాదని నా ధృఢనమ్మకం...ఐయాగోచేసింది చెడుగే అనుకోండి, అయినప్పటికీ అతనే కథానాయకుడు...అల్లాగే మాక్బెత్తు నాటకంలో...అల్లాగే మిల్టను సృష్టించిన సేటన్ విషయంలో... అల్లాగే వందలు...అదీగాక...మంచితనం, చెడ్డతనం అనే లక్షణాలు పుట్టుకతోనే అలవడేవి చాలా కొద్దిమందికి తక్కినవారి మంచితనం, చెడ్డతనం జీవితంలో వాళ్ల కల్గే పరిస్థితులవల్లా, వొడుదుడుకులవల్లా ఆవహిస్తూంటాయి...సరిగా యిందుకు నిదర్శనంగా వున్నదే ఒక కథ చెప్పింది చిన్నీ...నిజంగా జరిగింది. పేర్లెందుకూ చిన్నీతో చిన్నప్పుడు చదువుకున్న పిల్ల...మంచియింట పుట్టిందీ, మంచిబుధ్ధులు కలదీను...సంసారపక్షంది... పెళ్లయింది...అత్తవారింటికి వెళ్లింది...చక్కగా కాపురంచేసింది, రెండేళ్లు...పిల్లాడు కల్గాడు... తర్వాత పై చదువుకోసమని ఆపిల్ల మొగుడు ఇంగ్లండు వెళ్లాడు...మూడేళ్లదాకా తిరిగిరాలేదు ... ఆలోపున ఆ అమ్మాయి మొగుడిస్నేహితుడితో చనువుగా వుంటూండేది......కొంత టైం అయినతర్వాత, గ్రహచారమనండి, ఏమన్నా అనండి, ఆ స్నేహితుడితో మోహమాటపడ్డది ... ... సామెతలో చెప్పినంతా అయింది తుదకు...ఆతర్వాత గలభ, అదీ ... సరే గంపెడంత...మనకు సంబంధించింది, యింతవరకూ చాలు...ఎందుకు చెప్పానంటే...ఆపిల్ల స్వతస్సిద్ధంగా మంచి నడవడికలదే...కాని ఎందుకట్లా పొరబడిందో భగవంతుడికి తెల్సు.. కాబట్టి మంచిచెడ్డలు చాలా వరకూ విరుచుకుమీదపడ్తాయి......ప్రకృతినైజాన్ని మనం మార్చలేం..."

"అయితే మననాయకుడు మంచివాడో, చెడ్డవాడో మనం నిరూపించకూడదన్నమాట? ఇక వాడి గతేమిటోయ్?" అన్నాడు శాస్త్రి కొంచెంజోరుతో...

"సరే, యీవిషయం అల్లావుంచి, అసలు నవల ట్రాజిడీయో, కామిడీయో నిశ్చయించండి ముందు. దాన్నిబట్టి నాయకుని గుణగణాలు, చర్యలు నడిపించచ్చు" అన్నాడు చౌదరీ...

ఆవిషయాన్ని పురస్కరించుకుని కౌండిన్య "కామిడీగావుంటే బాగుంటుందని తోస్తుంది నాకు ... ఎందుకంటే నవలంతా ముగించినతర్వాత, విచారమనేది వుండకూడదు. అంతా హాయిగా, రోల్సు రాయిస్ కారు పోయినట్లుగా నడిచిపోవాలి ... చదివే వాళ్ళమనస్సు చీకాకుపడదు..."

"ఆమాటకువస్తే, జీవితం సాగిపోతోందా అల్లా, అని ప్రశ్నిస్తాను...దేవుడు సృష్టించిన దాంట్లోనే ఎత్తుపల్లాలూ, సుఖదుఃఖాలూ వుంటే యిక మనరచనలో నా సాఫీ? అనుకుంటాం, అంతా సవ్యంగాజరిగిపోతే బాగుండునని కాని సంభవమా? జీవితంలో విచారమనేది లేంది ఎప్పుడు చెప్పండి?...సంతోషంకన్న దుఃఖమేఎక్కువ లోకంలో...జీవితమనే భర్తకు సుఖదుఃఖాలనే సవతిభార్యలు. వాళ్లెప్పుడూ ఒకరిపై ఒకరు అధికారం సంపాదించటానికి పెనగులాడ్తుంటారు...అసలు యథార్థం చెప్పాలిసివస్తే దుఃఖమే సారస్వతానికి మూలాధారం అంటాను. అనాదినుంచీగూడాను...సీతమ్మ కష్టాలు తెల్పేభాగాలు లాగేస్తే రామాయణమెందుకన్నా పనికివస్తుందా?—కురు,పాండవవైరం మూలంగా సంభవించిన భూకంపాన్ని చూపించేకాండని మినహాయిస్తే భారతంలో మరేముందీ? ప్రహ్లాదుడి ఇక్కట్లను వర్ణించే ఘట్టాలను తెగ్గోస్తే అతగాడి చరిత్రలో మిగిలిందేముందీ? మహాసాధ్వి సావిత్రమ్మయమబాధల్ని మరుస్తే యికఆవిడగొప్పతనమేం తెలుసుకోగలం మనం? అల్లాగే, దమయంతి,చంద్రమతి,పద్మిని, అల్లాగే హోమరురచించిన హెలెన్; షేక్స్పియరు రూపకల్పన చేసిన నాయకులు,నాయకురాండ్రూను. కాబట్టిదుఃఖమే అసలు సారస్వతానికి మూలాధారం అంటాను. జీవితానికిగూడాను. సారస్వతం జీవితంయొక్క ప్రతిబింబం కాక మరేమిటి..." అని హడావిడిగా ఆగి, నాఅనపరాన్ని గ్రహించి శర్మ అందిచ్చిన టీని ఆరగించాను...

"—అయితే సారస్వతం జీవితాన్ని ఆశ్రయించుకుని బ్రతుకుతున్నతాబేదారంటావు నువ్వు. అంతేనా?" అని హేళనగా అడిగాడు శాస్త్రి....

నేను టీ త్రాగడం పూర్తికాలేదని గమనించి, చౌదరీ—"అల్లాగనే తోస్తుంది, అతనన్నదాన్నిబట్టి" అన్నాడు. టీ పూర్తిచేసి, వాళ్ల సందేహాలు తీర్చడానికి తిరిగిచెప్పాను:- "అంతకచ్చితంగా అనలేదనుకో, నేను. కాని అనడానికి జంకను. ఎంచేతా అంటే? కారణాలున్నాయి కాబట్టి...జీవితంలో లేని ఏ క్రొత్త విషయం సారస్వతంలో వున్నది, చెప్పండి...సారస్వతంలో నిరూపింపబడ్డవన్నీ, మనకు అంతప్రత్యక్షంగా జీవితంలో కన్పడకపోవచ్చు...కాని వాటికి మాతృక ఎక్కడో వుండేతీరుతుంది..."

శాస్త్రి అడ్డంవచ్చాడు:—"బాబూ, యిది డిబేటింగు సొసైటీలోకి దిగుతోంది, రాను రాను" అంటూ.

ప్రశ్నోత్తర మేమీ యివ్వడానికితోచక వూరుకున్నాను. శర్మ తనవిధ్యుక్త ధర్మంగా మాకందరికీ టీ, సిగరెట్లు అందిచ్చాడు...

"కేవలం మోహినీ అమృతం పంచుతూన్న దృశ్యం" అన్నాడు చౌదరీ...శర్మ కోపంతో చూసి ఏదో గునిశాడు...

మరి అయిదు నిమిషాలవరకూ ఎవ్వరం మాట్లాడలేదు. ఆనిశ్శబ్దాన్ని కలతపెస్తూ కౌండిన్య—"ఈదినం మన తెనుగుటాకీ "సక్కుబాయి" ప్రదర్శింపబడుతోంది. వెళ్లి చూద్దామోయ్, ఎల్లావుందో...ప్రతి వూళ్లోనూ అయిదారు వారాలకు తక్కువ రన్ కావడం లేదుట...ఇంకా అరగంట టైంవుంది" అన్నాడు రిస్టువాచివంక చూస్తూ...

శాస్త్రి తన అభ్యంతరం లేదన్నాడు. తనకూడా ఓటికెక్కట్టు మంజూరుచెయ్యమని శర్మ అర్జీ పెట్టాడు...

చౌదరీ భిన్నాభిప్రాయంతో నావంక చూస్తూ "ఏమంటావు బ్రదర్" అన్నాడు...

"ఏమనేదుంది...తెనుగుటాకీలనిగురించి నా అభిప్రాయాలు నీకు తెల్సుగా...ఎందుకోయ్, మనవాళ్లిల్లా ఆత్మవంచన చేసుకుంటున్నారు. మెచ్చుకోకపోతే ఆంధ్రాభిమానం లేదంటూ నల్గురూ మీదపడ్తారు...చూస్తూచూస్తూ వాట్ని మెచ్చుకోడమెల్లా. సినీమా ఆర్టు అంటే ఏమిటో తెలియదుగద; టాకీ తయారుచెయ్యడమంటే తెలియదుగద; ఏమీ తెలీకుండ, "మనంగూడా తెనుగులో ఫిల్ములుతయారుచెయ్యాలి" అనేదిలాసాతో డబ్బు తగలెయ్యడం, గంగానమ్మల్ని, పోలేరమ్మల్ని రంగంమీదికి యీడ్వడం, తైతక్కలాడించడం..." అన్నాను.

చౌదరీ తన అభిప్రాయాన్నిగూడా వెల్లడించాడు: "నువ్వన్నది అక్షరేణా నిజం...చూశానుగా, యింతవరకూ తయారైన తెనుగుటాకీల్ని...ఏ కొల్హాపూరులోనో, కలకత్తాలోనో తయారు చెయ్యడం, మనమీద విసరడం...యీమధ్య దీన్నిగురించే "కృష్ణాపత్రిక"లో ఓ ఆర్టికలు వ్రాశాను...అందరూ విరుచుకు మీదపడ్డారు. నిజంచెప్తే నిష్ఠూరంకామా, మరి...సర్వవిధాలా అధోగతి పాలుకావలిసివుంది ఆంధ్రదేశం...మనమేంజేస్తాం ... "ఆంధ్రులం, మే మాంధ్రులం" అంటూ కప్పగంతులువేస్తే సరా? అల్లానిలబడ్డానికి తగిన సరుకు, సత్తా వుండాలి. ... నేను రామబాబూ ఫిల్మం చూడ్డానికి, సినీమా వాంఛగూడా పోతుంది..." అని, ఓ ఘనకార్యం ముగించినంత సంతోషంతో సిగరెట్ ముట్టించాడు...

శాస్త్రి పీఠంకదిపి లేచి: "ఇక యీ దినానికి చాలిద్దాం, భాయీల్లారా. ప్రొద్దుపోతోంది...మన మేమనుకుంటేయేం?...ఆకలిగా ఉన్నట్టు:

రాహువు దంష్ట్రికిజిక్కి యుప
　　రాగ మలీమసుడైన భానున
ట్లే హృతతేజమై చెడి వి
　　హీన దశాగతమయ్యె నాంధ్ర మ
యో హతభాగ్యమై తుదకు
　　నూడ్చిన నుప్పుదొంగు నిట్టిసే
లా! హరి! మున్ను పృథ్వికిని
　　నయ్యెనసర్ఘ్య శిరస్థ భూషయున్!

అని ఎలుగెత్తి అనేసరికి కౌండిన్య ఆవేశంలో 'రమారమణ గోవిందో హరి' అని లేచాడు... అంద

రం కదిలాం.... ఫ్లాస్కులో అడుగున మిగిలినటీని వృథాచెయ్యడమెందుకని గొంతులో పోసుకుంటూండడంచేత కొంచెం వెనకబడ్డాడు శర్మ....

* * * * *

౪

మర్నాడు సాయంత్రం- దుస్తులువేసుకుని బయల్దేరుదామని అనుకుంటూండగా చౌదరీ, శాస్త్రీ, కౌండిన్య- సిద్ధమైనారు. వాళ్ళనిచూచి "స్వాముల్లారా, ఏం యీ దినం మీటింగులేదాయేం?" అన్నాను. శాస్త్రి బదులు చెప్పాడు, ముగ్గురి తరఫునా. లేకేం బాబూ. అనుకున్నదాంలో ఆవగింజలో అరభాగమైనా కాలేదు. అల్లావిడిచిపెడతామా...ఉద్యం పట్టు కాదూ మఃది... శర్మనిసాగనంపాం ముందు, టీ- యిత్యాదులతో... నిన్నుతీసుకుపోదామని యిల్లావచ్చాం." అన్నాడు.

కౌండిన్య కొంచెం నిరోగ్మహమాటం మనిషి. అంచేత అన్నాడు: "ఎందుకు శాస్త్రీ చల్లకువచ్చి ముంతదాచడం? వినాయకుడిమీద భక్తా-ఉండ్రాళ్ళమీద భక్తా అన్నట్టు - వచ్చింది కాఫీకోసం. మొహమాట మెందుకూ?"

అతనింకా పూర్తిగా ముగించకపూర్వమే లోపలినుంచి నౌకరువచ్చి ముగ్గురికీ కాఫీయిచ్చాడు.

"ఎల్లాంటి పకడ్బందీ అరేంజిమెంటో చూశావ్?" అంటూ చౌదరీ ఆస్వాదించడం మొదలెట్టాడు.

అనంతరం నల్గురం బయల్దేరాం. త్రోవలో అంటింతలులాగ వెంటబడే మిత్రుల్ని అందర్నీ ఎలాగో తప్పించుకుని గమ్యస్థానం జేరాం...ఓవైపు టీఫ్లాస్కులు, మరోవైపున గోల్డుఫ్లేక్ టిన్నులు పెట్టుకుని, మధ్య, ఇసుకమీద వెల్లకితలాపడుకొని, డిప్రెషన్ సర్దార్ శర్మ రాగాలాపనతో కుస్తీ పడ్తున్నాడు!

ఏవైపు పోకిరీ

పోకోలనో మాగు

నీ కవిత్వాలకే
లోకాలు మెచ్చునా...?
నీకింత భ్రమ ఎందుకోయీ,
మతిమాలి
నిన్నెవరు కవియందురోయీ?
నీకైత గిలకుడే
లోకవార్తంటావు...
లోకమన్నను...మట్టి
మూకుడేనా ఏమి...?
నీకింత భ్రమ ఎందుకోయీ,
మతిమాలి
నిన్నెవరు కవియందురోయీ?
నీభావ శాలలో
ఏబూజో పట్టింది...
నీభావకత్తెయే
కాబోలు చెప్పింది...
నీకింత భ్రమఎందుకోయీ—
మతిమాలీ
నిన్నెవరు కవి యందురోయీ?

"ఏమిట్రా, శర్మ అల్లా పల్లీలు కొడ్తున్నావ్"— అన్నాడు కపీమని శాస్త్రి...అదిరిపడి లేచి శర్మ— "అప్పుడేవచ్చారూ, అయ్యల్లారా...వొంటిరిగా వున్నానుగదా యని చౌదరీ గీతాన్ని నెమరవేస్తున్నాను"— అన్నాడు క్షమాపణపూర్వకంగా. నలుగురం నవ్వుకొంటూ—యథాస్థానాల్లో ఆసీనులమైనాం......

ఆపైసంగతి ఏమిటాయని అందరం ఆలోచనలో మున్నులమైయుండగా, కౌండిన్య— సీరియస్ పోజు పెట్టి, "సదస్యులారా! — నూతనప్రాణసంకలిత శక్తివంతులారా!—ఆంధ్రసాహితీసభా ముఖాబ్జసీమ స్థాపిత సుజ్ఞానచిహ్నంబులారా! భవమహాబంధక్రియోత్తారకాభయగీతావళీ ఆలాపకులారా! 'సర్వంఖల్విదం బ్రహ్మ' మంత్రరహస్యార్థ విబోధితులారా!—దిఙ్నర్తన క్రీడా విహారోజ్జీవచైతన్య కాండంబులారా!—మంగళకావ్య సముపకేష్టలారా! —నూతనోత్సాహసవనాహూతుల్ కండి—భవ్యాన పనిమొదలెట్టండి—"అని గుక్కతిప్ప

కుండా బుజ్వశన సాగించి, అలసటను పోగొట్టటానికి మరో సిగరెట్టును అందుకొన్నాడు...

మూర్ఛలోంచి తెప్పరిల్లినట్టుగా, దీర్ఘనిశ్వాస విడుస్తూ, శాస్త్రి:-"రక్షించి ఆపేశావు ప్రభూ. పూర్వ జన్మసుకృతం- ఇంకా కాస్త అంటుకుంది మాకు..." అన్నాడు...

"వీటికేంగాని, మనం కార్యానికి వుపక్రమించాలి" అన్నాను నేను. "శుభంభూయాత్" అని ఆశీర్వదించాడు శాస్త్రి.

అంతట చౌదరీ అన్నాడు:-"నాదో ప్రపోజలుంది,కవుల్లారా...నిన్నా మొన్నా మనం చేసినచర్చకు ఫలితం లేకపోయింది. ఈదినం, ముందుగా నాయకురాలిమాట తేల్చుకుందాం."

"భేష్, భేష్షూ" అన్నాడు శర్మ వెర్రికేక పెడ్తూ... కౌండిన్య ఉరిమిచూచాడు... పూర్వపు పాయింట్ ఆఫ్ ఆర్డర్ని ఛప్పున జ్ఞప్తికితెచ్చుకొని బిక్క మొహం పెట్టాడు శర్మ...

"పంచాంగంలో వున్న శుభశకునాల జాబితాలో- కన్య, ముత్తైదువ గూడా జేర్చబడ్డారు, సిద్ధాంతిగారి దయవల్ల... కాబట్టి- మనం నాయకురాలిప్రశంసతో - ఆవిడె వితంతువు కాకుండా వుంటే సరి!- ప్రారంభిస్తే మనప్రయత్నాలు అవిఘ్నంగా సాగుతాయని నా దృఢవిశ్వాసం..." అన్నాడు శాస్త్రిమహాశయుడు....

అప్పుడు నేనన్నాను: "సభవారివుద్దేశం ఎల్లా వుంటే అల్లాగే పోదాం...సరే, నాయకురాలి విషయం... ఒక్కటొక్కటే చూద్దాం... ముందు రూపం; తర్వాత వయస్సు; ఆపైన గుణం; పిమ్మట చర్యలు- యిల్లాగ యోచిద్దాం..."

-"అయితే పెళ్లీపెటాకులూ ఏమీవుండవాయేం ఆపిల్లకు, పాపం..." అని శర్మ యింకేమో అనబోతూ ఛప్పున కౌండిన్యను చూచి నోరుమూసుకున్నాడు....

అందరం విరగబడినవ్వాం...

శాస్త్రి, శర్మనుద్దేశించి: "అల్లాంటి దేమన్నా వుంటే దరఖాస్తు పెట్టుకుంటావా ఏం, బాబూ, యిప్పుడే?" అని హేళనచేసి, మావైపుతిరిగి..."నాకు తోచింది ముందుగానే చెప్తున్నాను...నాయిక నవయుగందిగా వుండాలి ... 'నవనవోన్మేష సౌందర్యనావ'లాగుండాలి...పద్దెనిమిదేళ్లకన్న ఎక్కువ వుండకూడదు యీడు...తొంభైతొమ్మిదిపాళ్లుగల ఆర్టిస్టిక్ టెంపరమెంటుగలదై వుండాలి...అంటే, ఎప్పుడూ సిల్కుచీరెల్ని కట్టుకునివుండాలి...తలలో-ఏపూలైనా సరే, గంపెడు వుండాలి...జబ్బలపైకి వుండాలి జంపరు...ఎప్పుడూ అయిదుపాయలదో, సంచీజడో వేసుకునివుండాలి...మఖమల్ స్లిప్పర్లు తొడుక్కొని, వంటింట్లోకిపోయినా విడవకూడదు ... ... నిల్చున్నా, కూర్చున్నా, తొంగున్నా-గోహార్ పోజులు పెట్టాలి... నాయకుడు సాయంకాలం యిల్లువిడిచి షికారుకు పోతుంటే, ఆవిడె వాకిలిదాకావచ్చి, అసావేరిరాగంతో "పోవుదున్నాడే!..." అనే కీర్తన పూర్తిగా పాడి, అలసటతో-హాల్లోవున్న సోఫాలో పడిపోవాలి...నాయకుడు, క్లబ్బునుంచి రాత్రి యింటికి వచ్చేసరికి ఆవిడె విరహవేదన్ని ప్రదర్శిస్తూ—

మాకుమార విహార
లోకైక మోహనా
నీకోసమై ఎన్ని
కోకిల్లసావాలో...
కనులార నినుగాంచ
గల తరుణ మెన్నడని
కను రెప్పవేయకే
కాచి—వేచియున్న వేళ......

ఆవిడె నాయకుణ్ణి ఎప్పుడూ మనోహరా, చిత్తచోరా, హృదయేశ్వరా, ప్రియా, మదవతీసమన్మథా, రతనాలమొలకా, వలపులగిలకా అనేవాటిల్లో ఏదన్నా ఒకదాన్ని వుపయోగించి సంబోధిస్తూండాలి ...నాయకుడు పిల్చినప్పుడు ఆవిడె నృత్యంచేస్తూనో, కులుకు చూపెట్టూనో వెళ్లాలిదగ్గరకు...కాళ్లకుపారాణి,

కళ్ళకు కాటుకా, ముఖాన కుంకం, నడుముకు వడ్డాణం- ఘోరపాటునగూడా పెట్టుకోకూడదు... పైటచెంగు ఒక బుజం మీదనుంచే తెరచాపలాగు వ్రేలాడవెయ్యాలి-కదిలి నప్పుడల్లా రెపరెపలాడేటట్టు...... భాయీసాబ్... యిల్లాంటి నాయికను సృష్టించ్చామంటే యిక చెప్పాలా- మన నవల గొప్పదనం... చదివేవాళ్లు తబ్బిబ్బులై-నిద్రలు గూడా చేగొట్టుకుంటారు...హామేషా, ప్రతికాలేజీ కుర్రవాళ్లూ పుస్తకాన్ని కొని, అసలు పాఠాలుగూడా మరచిపోయి, మననవలనే వల్లిస్తారు, అహర్నిశం..... మననవలను ఆంధ్రయూనివర్శిటీ పోటీపరీక్షకు పంపించిన-నియమింపబడ్డ జడ్జీలుగూడా, చక్కిలిగిలిచెంది, బహుమానాన్ని- ఖండించకుండా, ఏకగ్రీవంగా, మన నవలకేయిస్తారు..." అని దరహాసంతో ముగించి, శర్మని అగ్గిపెట్టి యిమ్మన్నాడు...

"శాస్త్రి చెప్పిందాన్ని నేను హృదయపూర్వకంగా బలపరస్తున్నాను...అల్లాంటి నాయిక - నా "చిత్రావతి"కి అక్కల్లేవుంటుంది" అన్నాడు చౌదరీ సిగరెట్టు తునకని యిసుకలో పూడ్చిపెడ్తూ...

"శాశ్వత బ్రహ్మచర్యదీక్షాపరుడైన చౌదరీ నాయిక విషయంలో అంతగా జబర్దస్తీ చెప్పడానికి అర్హతలేదు ... " అని కౌండిన్య అభ్యంతరం పెట్టాడు..."నీ పాయింట్ ఆఫ్ ఆర్డర్తో చంపేస్తున్నావేం ప్రభూ. లాయరు అయినందుకు - వూర్కేపోనిస్తున్నావుగాదు," అని చౌదరీ జేబులోంచి లవంగాలుతీసి, "కావలిసినవాళ్లెవరు" అన్నాడు...

"లలిత లవంగలతా పరిశీలన కోమలమలయ సమీరే" అంటూ నేనూ ఓ లవంగాన్ని పుచ్చుకొని, నోట్లోవేసుకుని, అన్నాను:- "శాస్త్రి చెప్పింది బాగానే వుంది. నాయిక అల్లాగే, చలాకీగాను, చమకో పిల్లగాను వుండాలని నా మతంగూడాను. అతను శెలవిచ్చిన దాంట్లో కొన్ని నూతనాంశాలువున్నా, చాలాభాగం మన పూర్వులు శాసించిన లక్షణాలుకలదిగనే కన్పడుతుంది...ఆ పూర్వలక్షణాలనే పూర్తిగా వుంచాలంటే, మనం కామశాస్త్రం, రతిమంజరి మొదలైన శృంగార లాక్షణిక గ్రంథాల్ని తిరగవెయ్యవలసివుంటుంది. పోనీ, ఆభారం శాస్త్రికే వదిలివేస్తామనుకోండి... అయినప్పటికీ నా కో సందేహం స్ఫురిస్తోంది .... మన నాయిక- అదే, మన నవలానాయిక- సెంట్ పర్సెంటు ఆధునికంగా వుండాలంటే- శాస్త్రి సూచించిన ప్రకారం ఆవిడ్ని చిత్రించడం చాలదు...ఉదాహరణకు చెప్తున్నాను: శాస్త్రి అన్నాడు - నాయకుడు బయటనుంచి వచ్చేసరికి, నిరీక్షిస్తూ నాయిక వుండాలని...అంటే అతనంటే అంత ఆపేక్ష, భక్తిశ్రద్ధలు కలిగివుండాలన్నమాట ఆవిడ ... అది పూర్వసాంప్రదాయమే. అందులో క్రొత్త ఏముంది? నాయిక నాయకుణ్ణి ప్రేమించడం, భార్య భర్తని దేవుడని గౌరవించడంలో- అల్లాంటి స్త్రీలు సహృదయులైతే కావచ్చు, కాని- పిరికిపందలు, మెదడు లేనివాళ్లూ అని నా నమ్మకం...నూటికి ప్రవర్తించే నాయికజీవితంలో నవ్యత్వం, నవకం ఏముంటాయి ఆలోచించండి? గుమ్మం దాటనికాళ్లు, పరాయి పురుషుణ్ణి చూడనికన్ను, అర్ధణా అంత కుంకంబొట్టు, చారెడంతకొప్పు, కాశాపోసి కట్టిన చీర, పిల్లలు, గొడవ - యిదేనా మరేమన్నావుందా ? మన నాయికలో ప్రత్యేకత ప్రాముఖ్యంగావుండాలి..."

కౌండిన్య అడ్డంవచ్చి—"అంటే నాలుగుకాళ్లూ, నాలుగుచేతులూ, అల్లావుండాలనా నీ అభిప్రాయం..." అని ప్రశ్నించాడు.

"కాదోయ్, దేవరా, చెప్పేది సాంతంవిను, మరి... సారస్వతంలో అవలంబించడానికి ముఖ్యమైనవి రెండు విధాలున్నాయి...ఒకటి - వున్నదివున్నట్టుగా చిత్రించడం...రెండోది...అవకాశాలను సూచించడం... అంటే, విశదీకరిస్తున్నాను... ఇప్పుడు ఎడ్గర్ వాలెస్ నవల లున్నాయి...అతను వ్రాసినదంతా జరిగిందనా? కాదు, అలాజరగడానికి గూడా అవకాశ ముందని సూచన....ఆకిటుకును మెచ్చుకొనే, ఒకమారు దొంగల గురువెవరో వాలెస్‌కు ఆకాశరామన్న వుత్తరం వ్రాశాట్ట " మీరు ఫలానానవల్లో చెప్పినవిషయాలు మాపనికి ఎంతో సహకారిగావున్నాయి" అని...అల్లాగే...మన ... నవలానాయిక విషయంలోనూ చూపించవచ్చు...మాటవరుసకి చెప్తాను...నాయిక సైకి

లెక్కడం నేర్చివుంటుందనుకోండి....అందులో ఎంత గంభీరసలహా వుందంటారు... తెలివిగలవాళ్లయితే తక్కిన ఆడవాళ్లందరూగూడ సైకిలు త్రొక్కడం నేర్చుకోవాలి. దీంచేత...ఆవిద్యవచ్చివుంటే- పేరంటానికి వెళ్లినప్పుడు, చుట్టాల్ని చూడ్డానికి పోయినప్పుడు అనవసరంగా అయ్యే బండీఖర్చు తగ్గుతుంది!...అల్లాగే- నాయిక మోటారునడపడం నేర్చింది అయివుంటుందనుకోండి...ఎంతోమంచిది....

సరిగ్గా, టైముకి మొగుళ్లను ఆఫీసుకు రానుపోను చేర వెయ్యవచ్చు...అనవసరమైన డ్రైవరు జీతం తగ్గుతుంది...ఇల్లాంటివే- నూత్నలక్షణాలు కలదిగా వుండాలి నాయిక...టెన్నిస్ ఆడగలిగి వుండాలి...ఏరోప్లేను నడపడానికి భయపడనిదిగా వుండాలి...అప్పుడప్పుడు...సూట్ వేసుకుని మొగదుస్తులతో బయటకు పోవడానికి వెరపులేకుండా వుండాలి... ఇదెంత ఫస్టుక్లాసు ఐడియా అంటారు?- అదృష్టవశాత్తు భార్యాభర్తలు ఒక్క సైజువాళ్లే అయితే ఇద్దరికీ ఆసూట్లే పనికివస్తాయి...అనవసరమైన చీరెలపద్దులు తప్పుతాయి...ఇల్లాంటి నాయికను సృష్టించామంటే అమోఘంగా వుంటుంది...ఏమంటారు?" అన్నాను...

శాస్త్రి అడిగాడు:— "అయితే, అల్లాంటి నాయిక అపభ్రంశమైనదని అభిప్రాయపడ్తూ, చాలామంది- అదే పురాతనాన్ని, సాంప్రదాయాలని పూసుకు తిరిగేవాళ్లు- నవలను నిషేధిస్తారేమో ?"...అందుకు చౌదరి బదులుచెప్పాడు :— "జానేదేవ్ !- అందరికీ సమ్మతమైంది రచించడానికి 'మమ్మునిర్మించిన బ్రహ్మకైన తరమా' ?- అందర్నీ ఎలాగూ మెప్పించలేం... తెల్సుగా యీసప్సు ఫేబుల్సులో కథ- గాడిద, యజమాని, కొడుకు - ఆకథ. ఈశ్వరసృష్టే సర్వజనసమ్మతం కానప్పుడు యిక మానవరచనా ?... భూషన్ చెప్పింది బేషుగ్గావుంది...ఎల్లాగేనా అతను నేను వెనకెప్పుడో అన్నట్లు:—

జబరదస్తీ మనిషిరా
భూషణుడు ...
... గుబులు పుట్టిస్తాడురా!"

అని దీర్ఘంతీస్తూ మెహర్బానీగా నావంక చూచాడు.

"నాది మరొక సలహా" అని కౌండిన్య ప్రారంభించాడు :—"నాయికకు కొంచెం తలతిక్కగూడా వుండాలి !" అని.

"తప్పకుండాను, స్వామీ. అదిలేందే ఎల్లా. సాధువైన నాయిక మోటారునడకలే అలజడిలేకుండా వుంటుంది. తలతిక్క నాయిక క్రొవ్వివున్న గుర్రంమీద స్వారీలావుంటుంది. ఉత్తరక్షణం ఏ పొదలో పడద్రోస్తుందో అని ఆదుర్దాగా వుంటుంది. అల్లాగే ఆవిడే మరుక్షణంలో ఏ విధంగా ప్రవర్తిస్తుందో అని చదువరులు కౌతుకపడ్తారు. కాబట్టి తల తిక్కవుండి తీరాలి- నాయికకు, తప్పకుండా...ఈ ఐడియా చాలాకాలం క్రిందనే నేను "తలతిక్క" అనే ఏకాంక నాటకంలో వెలిబుచ్చాను." అన్నాను నేను...

ఇక భావాలేమీ లేనట్లుగా అందరూ మూకీభావం వహించారు. వికృతంగావున్న నిశ్శబ్దాన్ని పారద్రోలుదామని ఏదో అనబోతూండగా, శర్మ- "క్షమించాలి, నాదోమనవి" అని నావైపు తిరిగి, నేను "ఊఁ కానీ" అనగానే ధైర్యం క్రోడీకరించుకొని అన్నాడు:- "నాయికకు కావలసిన చీరెలుగాని, సబ్బులు, తలనూనె వగైరా, సైకిలు-యిత్యాదులన్నీ మావాళ్ల 'కామ్రేడ్సు అండుకో' లోనేకొనేటట్టుగా ఏర్పాటు చెయ్యాలి... వాళ్ల షాపులో అన్నీ దొరుకుతాయి... ఆవిషయం గూడా నవలలో యిరికించారా, వీళ్లకు కావలసినంత అడ్వర్టైజుమెంటు అవుతుంది...ప్రస్తుతం వాళ్లపని

కామ్రేడ్సు అండుకో
జేరం లేదుకనుక
హాయిగాపండుకో
అన్నట్టువుంది."

మాలో ఒక్కరికీ నవ్వు ఆగలేదు. అదంతా తనకి కాంప్లిమెంటే ననుకుంటూ శర్మగూడా నవ్వాడు...

ఆ నవ్వుల అలజడి యింకా తగ్గనేలేదు. భస్వర శాస్త్రి లేచి- "కాస్త స్టేషన్ దాకా వెళ్ళివస్తానోయ్... మా పెద్దబావ యీరైల్లో వెడుతున్నాడు..." అన్నాడు.

"మరిచిపోయినా, వుత్తరం ఒకటి పోస్టులో వెయ్యాలి. నేనూవస్తాను" అని కౌండిన్య లేచాడు...

"చూచుని చూచుని నడుం తీపుపెడ్తోంది...అంచాకా నేనూ వస్తాను, పదండోయ్..." అని చౌదరీ త్రోవదీశాడు....

శర్మ, నేను...మిగిలిపోయినాం...ఫర్లాంగుదూరంలోవున్నా, నడక అంటే సహజమైన బద్ధకంచేత అక్కడే వుండిపోయినాను... ఫ్లాస్కులోవున్న టీని కాస్తా నాకిచ్చి, దాని ప్రక్షాళనానిమిత్తం శర్మ కాలవకి వెళ్ళాడు....

పావుగంటతర్వాత, స్టేషనుకుపోయిన త్రిమూర్తులూ తిరిగివచ్చారు. ప్రొద్దెక్కుతోంది పోదామన్నారు.... బయల్దేరుతూ అన్నాను: "అబ్బాయిల్లారా, ఇక్కడికి మూడురోజులైంది... గట్టిగా తేలిందేంలేదు. మనప్రయత్నాలిల్లా నిష్ఫలమైపోకూడదు...రేపు ఆఖరుసమావేశమనుకొని, తీవ్రంగా యోచించి, అన్నీ ఖాయపరచుకుందాం... కాబట్టి"

"భూషన్, స్థలాన్ని మారుస్తే బాగుంటుందోయ్. రేపు మరోచోట కలుసుకుంటే ఏమన్నా చెయ్యగల్గుతామేమో...ఏమంటావ్?"...అన్నాడు శాస్త్రి.

—"దానికేం, శాస్త్రీ... అల్లాగేచేదాం...మంగినపూడి సముద్రపుటొడ్డున వేదాం మకాం. ఆయిసుకా, సముద్రం, రోదా, చంద్రోదయం- అన్నీ రొమాంటిక్‌గా వుంటాయి.... అందరికీ యిష్టమేనా?" అన్నాను.

"ఇష్టమేగాని, రేపు ఫలహారంకూడా ఏర్పాటు చెయ్యాలిఅక్కడే. పిక్నిక్కు దివ్యంగావుంటుంది..." అన్నాడు చౌదరీ.

"మామూలుకన్న మరోటిన్ గోల్డుఫ్లేకులు ఎక్కువగావుండాలి అని నామనవి." అన్నాడు కౌండిన్య.

"అవంతా శర్మవంతు" అన్నాను నేను...

"ఆఁహాఁ. తప్పకుండా జ్ఞాపకంపెట్టుకుంటాను" అన్నాడు శర్మ...

కాలువగట్టు దాటి రోడ్డుఎక్కి నడక సాగించాము.

* * * *

౫

మర్నాడు సంధ్యవేళ డాక్టరుగారి కారులో నేను మంగినపూడి చేరుకునే సరికి అక్కడ జగన్నాథానికి చెందిన "దైవాధీనం మోటారుసర్వీసు"- తాలూకు బస్ ఒకటి కన్పించింది...మాపిక్నిక్కు మజానిచెడగొట్టడానికి మరేదో ముఠాగూడావచ్చింది కాబోలని సంశయంతో ఆ డ్రయివరును ప్రశ్నించగా—చౌదరీ, శాస్త్రి, కౌండిన్య, శర్మ - అందులో వచ్చారని చెప్పాడు. సెబాష్ అనుకొంటూ, యిసుకలోంచి దాదాపు యీ భైగజాలదూరం నడిచిపోయినా మిత్రులెవరూ కనపడలేదు...బహుశః యిసుకతిన్నెల మాటున కూర్చున్నారేమోనని ముందుకు సాగిపోతుండగా శర్మగొంతు వినబడ్డది...ఇసుకలో బోర్లకితులా పడుకొని పాడుతున్నాడు:—

శరణు శరణను సాగరా—
చరణ మిత్తును సాగరా—
ఈచాకిరీ వొద్దిక సాగరా—
స్వేచ్ఛనిమ్మిక సాగరా—

"ఏమిటి సర్దార్ భాయీ, సాగరసంగీతంతో మేళవిస్తున్నావూ" అంటూ శర్మదగ్గర కెళ్ళాను...

పాడుతూన్న గీతాన్ని ఆపి ... "పావుగంటైంది వచ్చి...అదుగో- ఆముగ్గురూ - ఆ యిసుకగుట్టమాటున వున్నారు...పోదామా అల్లా." అన్నాడు శర్మ ... ఇద్దరం ఆవైపు వెళ్ళాం. శాస్త్రి, కౌండిన్య, చౌదరీ- ముగ్గురూ మూడురకాలుగా పాడుతున్నారు, కూనురాగం తీస్తూ

శాస్త్రి—

కలువకన్నుల చేలుసొగసుల
పులకరించిన మేనివలపులు

చెలిమికోసము పలవరించే
చిన్నలే.........ఓవన్నెలాడీ!
మొరసి విరిసిన మోవినొక్కులు
సరసులో నను తళుకు చెక్కులు
వరుసలెంచని తలిరుప్రాయపు
వన్నెలే.........ఓచిన్నెలాడీ!
నిదుర మొగ్గ మెరుగని విలాసము
ఎదిరి మాటాడిన వయారము
చనువుగా దరిజేర రమ్మను
సన్నలే.........ఓవన్నెలాడీ!
.......................
.......................
విడజాలగలనా-నిను బాసి
గడియైన-మనజాలగలనా—
............లలనామనోజా—

కౌండిన్య—
గాలివిరిసిన మబ్బుపింజెల
పూలదండలు ఎవరికో—
సన్నమబ్బుల డాగి మెఱపుల
కన్నుసైగలు ఎవరికో?......

చౌదరీ:—
నీచిన్ని అడుగులో నృత్యకళ వికసించు
నీచిరునవ్వులో చిత్రకళ రహియించు
నాయింటి ముందర
నాకంటి ముందర
ఈవిశ్వకలయాన్ని నవరంగభూమిగా
శివిశృంగారించి జీవనాటక మొకటి
ఆడిపోదువుగాని
పాడిపోదువుగాని
రా! నాబాల రా!!......
.......................
.......................
ఎవరువస్తా రెవరువస్తారో!...

వెలుగు పువ్వుల విచ్చిన విందై
కలిమితల్లి ఉషే వస్తుందో
ఎవరువస్తా రెవరువస్తారో!.. ......

— "ఉషాబాల ఎల్లావస్తుందోయ్...ఆరుమైళ్ల దూరాన్నుంచి?...నేను వచ్చా నిదుగో" అంటూ వాళ్ల పాటలకి అంతరాయం కల్గించాను...

—"వచ్చిపడ్డావు, బాబూ. మోటారుకేదన్నా ప్రమాదం కల్గి, నవ్వురాకుండావుంటే బాగుండునని ప్రార్థిస్తున్నాను దేవుణ్ణి...తిరిగి నవలనిగూర్చిన తర్కం మొదలెడ్తావు." అన్నాడు శాస్త్రి...

—"భూషన్...యివ్వాళ ఆవిషయాలేమీ ఎత్తుకోకుండా, పాటల్లో తన్మయులమౌదామోయ్. దివ్యంగా రేగిపోతోంది ఇన్స్పిరేషన్" అన్నాడు చౌదరీ...

"అబ్బే అదేమన్నమాట...ఫలహారం అదీ అయింతర్వాత, కాస్సేపు బిజినెస్ మాట్లాడుదాం...అయినంతవరకే అవుతుంది...దానికేం" అన్నాడు కౌండిన్య శర్మకు సంజ్ఞచేస్తూ...దాన్ని గ్రహించి, శర్మ తెచ్చిన ఫలహారాల్ని, టీని బయటపెట్టాడు...అవికంటబడ్డంతోనే అందరి గానలహరీ అంతరించింది...విందు అనంతరం అగ్నిహోత్రంఅంటించారు అందరూ...కాగితం కలం పుచ్చుకొని శ్రద్ధవహించాడు శర్మ...అంతలో నవలవిషయంవైపు మరలింది అందరిమనస్సూ: ఆవేడి వుండగానే వుపక్రమిస్తే మంచిదని అన్నాను. "చూడండోయ్, ముఖ్యమైనదాన్నొక్కటి దాటవేశాం యింతవరకూ."

"ఏం, తెచ్చిన తినుబండారాల్లో ఏదన్నా బస్సులోనే విడిచిపెట్టాడా ఏం శర్మ?" అన్నాడు కౌండిన్య ఆతురతతో...

"అబ్బ, ఎప్పుడూ అదేధోరణా...అదికాదోయ్...నవలల్లోని శైలి, భాష విషయం...." అని చెప్పాను...

"ఔం, అది ముఖ్యమైన విషయంసుమా. మనం గ్రాంథికాన్ని ఉపయోగించాలో, గ్రామ్యాన్ని అదే,

వాడుకభాషని-వాడాలో, అది ముందే తేల్చుకుంటే మంచిది.” అన్నాడు చౌదరి.

“అదే నేను అన్నదీని...నీ అభిప్రాయ మేమిటి శాస్త్రీ?” అని అడిగాను. శాస్త్రి ప్రత్యుత్తర మిచ్చాడు: “అంతఆలోచించడానికి ఏముంది...వాడుక భాషలోనే వ్రాయడం ఉత్తమం, ధర్మం...అందరికీ సులభగ్రాహ్య మౌతుంది. అల్లాగాక, అరసున్నాల తోను,పూర్ణానుస్వారాలతోను, “నీతిచంద్రిక” శైలిలో ‘చెలీ,నీచెలిమిబాయ నాతరమా, శరదైందవదీవ్యద్వాసర తరసాంతర ప్రాభాకరమా,హసాంకురమా, తరమా,చెలీ’ అని వ్రాశామనుకోండి. ఆఆతత తేహిత త్తహితసాధితథం ధణుధాణుధింధిమివ్రాతలు యేరికిగావలెనో? పెద్దన్న ఆశువుగాచెప్పిన మాలిక జ్ఞప్తి వుందికాదూ? ఆయన సూచించాడే, జగ్గునిగ్గునెనగావలె కమ్మనకమ్మనవ్వలెన్ ‘నాతోడనున్న మిటారపు ముద్దులగుమ్మ’ అంటూ ఏమేమో చెప్పాడు చూడండి. అల్లావుండాలిమనశైలిగూడాను...ఉచ్చరించడానికి నోరు తిరగాలి...అంతేగాని సంస్కృతిపదాలతో పిష్టపేషణంగా తయారుజేస్తే మననవలకొన్న ప్రతివాడికీ ఓనిఘంటువునిగూడా సప్లై చెయ్యాలిసివుంటుంది...కాబట్టి, వాడుకభాషనే వుపయోగించి చేతనైనంత సులభశైలిలో వ్రాయడం యీ ఆదీక్మ అభిప్రాయం” అని శాస్త్రి ముగించాడు. సిగరెట్‌కోసం జేబు తడుముకొంటూ.

కౌండిన్య అందుకుసమ్మతించలేదు. గ్రాంధికమే అవలంబింపబడాలని వాదిస్తూ మొదలెట్టాడు. “మనపూర్వ గ్రంథాలు యింతవరకు నిల్చివున్నాయంటే అందుకు చాటిశైలియొక్క పటుత్వమే ఓముఖ్యకారణం... సంస్కృతపదాలతో నిండినభాష రత్నఖచితమకుటం లాగ మెరుస్తూంటుంది. సలలిత మురళీనిస్వనసుధాసరళీ రసధారల్ని చవిచూపిస్తుంది... కన్నీటి కెరటాలలో వెన్నెలల్నికల్పిస్తుంది...నిట్టూర్పుగాడ్పులో సెత్తావిని జిమ్ముతుంది...స్వతఃప్రతిభ పీర్యవద్ఘదన సుమంత్రతంత్ర నిర్వహణతను వెల్లడిస్తుంది...అదీగాక మనం వాడుక భాషలోవ్రాస్తే అందరుపండితులూ మననవలను బహిష్కరిస్తారు.”

శాస్త్రి అందుకొని “నీ చివరవాదన సరియైంది కాదు...పండితులకోసం మాత్రమా వ్రాస్తాఃహూ ఏం నవలని? అయినా పండితులు, సాహిత్య పూర్వాచార పరాయణులు ఎంతమందీ అసలు? వాళ్లకంటె పామర జనులు లక్షలు...ఇంకా కావాలనుకుంటే, టి. ఏ. యిస్తే, పర్లాకిమిడివెళ్లి, శ్రీ గిడుగు రామమూర్తి పంతులిగార్ని ఆశ్రయించి, బ్రహ్మాండమైన ఉపోద్ఘాతం వ్రాయించుకొస్తాను, మననవలకు...అది దివ్యమైన సమ్మోహనాస్త్రం...”అన్నాడు శాస్త్రి.

“ బంగారంలాటి మాట అన్నావోయ్ శాస్త్రీ! రామమూర్తిగారి పీఠిక గ్రాంధికభాషా దేవళ్లకి బిరడా పెట్టినట్టుంటుంది. దానికి మకుటంగా నాకోటి తోస్తోంది. మిత్రుల్లారా...నవలకు ముందుపేజీపైన, “శ్రీ...జ...రా......పంతులుగారికి, వారి పదవర పడిలో నడిచే గ్రాంథికవాద శాండ్రోకీ, అనుమతి లేకుండా, అంకితం...”అని అచ్చువేశామా, ఎంత ట్రెమెండస్‌గానైనా వుంటుంది...ఏమంటారు?”... అన్నాను నేను.

“ మూడుపువ్వులు, ఆరుకాయలుగా వుంటుంది. వెంటనే పత్రికల్లో గాలిదుమారం రేగిపోదూ” అన్నాడు చౌదరి...

మేమేదో పెద్దసమస్యని పరిష్కారం చేశామనే సంతోషంతో కాబోలు, శర్మ అందరికీ టీ అర్పించాడు కిళ్లీలనిగూడా పంచాడు...

దాంతో తిరిగి చౌదరికి రొమాంటిక్ మూడ్ రేగింది... “కాస్సేపు అల్లాపోయి, ఆ చంద్రోదయాన్ని చూద్దాం రండో. [illegible] వుందో కెరటాలపైన అ[illegible]ర్ణ[illegible]రథం” అన్నాడు, లేస్తూ... శాస్త్రి, కౌండిన్య కూడా అతన్ని వెంబడించారు... ఇక వాళ్లని బలవంతంచేసి కూర్చోపెట్టినా పని కాదని తోచి వూరుకున్నాను... వాళ్లా, నీటివొడ్డుకు పోయి అలలతో ఆటలు సాగించారు.......

నేనూ, శర్మా మిగిలాం...

విసుగుతో అన్నాను: "ఎవ్వళ్లకీ ఆసుర్దా వున్నట్టు కన్పడ్డం లేదు నవలఅంటే... నేనొకణ్ణి పట్టుకు దేవుళ్లాడుతే ఏమౌతుంది..." 'పాయింట్ ఆఫ్ ఆర్డరు' అంటూ అభ్యంతర పెట్టడానికి కౌండిన్య లేడుగదా అని ధైర్యంతో శర్మ అన్నాడు:—"ఇంకో రహస్యం గూడా చెప్తాను...మళ్లా పైకిఅనక...ఇందాక బస్సులోవస్తూంటే చౌదరీ అంటున్నాడు కౌండిన్యతో: 'ఏమిటి, నవల నవల అంటూ వేధిస్తున్నాడు భూషన్ ? కావాలంటే ఒక్కడూ గ్రాసుగో గూడదూ?...ఆపనికి మన నాలుగుతలకాయలూ కావాలా? అయినా...యిది నాటకాల శకం. నవల లెవరి క్కావాలీ? మన అభిప్రాయాలూ, ఆశలూ నాటకంలో వ్రాయకూడదూ? అలాంటి చక్కని నాటకంవ్రాసి, స్టేజిమీద ప్రదర్శిస్తే ఎక్కువ యిఫెక్ట్ వుంటుంది. చెప్తే గ్రహించడు అతను సరే, యీవేళకు రానేవచ్చాం, రేపట్నుంచీ మన ముగ్గరం ఏదోపనిమిష పెట్టి తప్పుకుందాం...అతనికే తెలిసివస్తుంది' అన్నాడు......శాస్త్రి తటస్థంగా వూరొకన్నాడు కాని, కౌండిన్య అతనికి తాళం వేశాడు......"

నాకు నిజంగా కోపంవచ్చింది...చౌదరీమీద... వాళ్లకన్న ముందే మీటింగులు చాలించాలని నిశ్చయించుకొన్నాను.........లేచి, వాళ్లున్నవైపు వెళ్లాను. ఒక్కళ్లమీ దొకళ్లు నీళ్లు విసురుకుంటూ కేరింతలు కొడ్తున్నారు......వాళ్లనుద్దేశించి: "నేను వెడ్తున్నానోయ్...క్లబ్బు మీటింగుంది...రేపూ, ఎల్లుండిగూడా సాయంకాలం కాస్తపనివుంది...తిరిగి ఎప్పుడు కలుసుకునేది తర్వాత చెప్తాను" అని వెనక్కిమరిలాను... "రక్షించావు" అనుకుంటూ వాళ్ల ధోరణిలోనే వున్నారు.. ...

త్రోవంతటా,కోపభావాలే కలచివేచినై నన్ను. ఆవైఖరితో యింటికిపోతే చిన్నీ చేతసోల్లుంతనం తప్పదని గ్రహించి, మనశ్శాంతికోసం ఓగంట క్లబ్బులో గడిపి యిల్లుచేరుకొన్నాను. లేనిపోని సంతోషాన్ని వెలిబుచ్చడానికి

వీణాపాణీ

ప్రణయగాధయిది
ఏనాడైనా
విని యున్నారా!
వీణాపాణీ
ఘనవాదనయిది
ఏనాడైనా
గనియున్నారా!

అని రాగంతీస్తూ ప్రవేశించాను...గదిలోదుస్తులు మార్చుకుంటూండగా చిన్నీ ప్రవేశించి "ఏం, పాటలో మునిగి తేల్తున్నారు...నవలాప్రయత్నాలు ఫలించినై ఏం?..." అన్నది.

బలవంతంగా మరచిపోతున్నదంతా గభాలున జ్ఞప్తికివచ్చింది... అయినా, భావాలనన్నీ బిగియబట్టుకొని..."ఫలిస్తాయి, తొందరపడితే ఎల్లా...సాధిస్తున్నాం..." అన్నాను...

"అమృతమధనంకన్న ఉత్కృష్టంగా వుందే మీఅందరిసాధన." అన్నది తిరిగి...

వూరొకన్నాను...ధారాళంగా మాట్లాడితే అసలుభావా లెక్కడ బయటపడ్తాయోయని.

అయిదునిమిషాలు గడిచింది...ఏదో అదీ యిదీ సర్దుతూ కాలంపుచ్చాను...

అంతలో చిన్నీ...చేతులోవున్న పుస్తకాన్ని తెరిచి, అందులో చూస్తున్నట్టుగా నటించి వెక్కిరింపుగా పాడడం ప్రారంభించింది:—

ఆకల్లాడ దదేమొ నేడు,
సిగ్గుచే ఆంధ్రసాహితీకన్యక
ఆకాశవాపీ తటాశోకానేకవనాలి గ్రుమ్మరుచు
నచ్చోడాగెనో......

లేక—
మంగినపూడి సాగరప్రవాహముల నూగంబోయి,
అట ఇచ్ఛాజీవులు అల్లిబిల్లిగ నవలనల్లు స్థితికిన్
ఖిన్నయై ఏడ్వదొడంగెనో......

......అంత, శౌనకమహామునీంద్రుడు, పల్లవ గ్రాసక షాయకంఠ కలకంఠ వధూకలకాకలీధ్వనితో—

అమ్మ, ఆంధ్రసారస్వతమ్మ
కాటుక కంటినీరు-ఏదో - కట్టు బయింపడ
నేలవిడ్చెదో......

అని యింకేమో అనబోతూండగా, కోపమాగక దగ్గరకెళ్లి—"ఎందుకు యీ అప్రాచ్యం..." అని చిన్నీ చేతులో పుస్తకాన్ని లాక్కొన్నాను...అట్టపైన పెద్ద అక్షరాలు గోచరించినై..."ఇచ్ఛాశీవుల నవలా రత్న ప్రయత్న ఫెళఫెళార్భటులను రికార్డుచేసిన మినిట్స్ బుక్ ..." క్రిందసంతకం "డిప్రెషన్ సర్దార్ శర్మ"...అని...

దాన్ని వింతగాను, రోతగాను చూస్తుండగా, "మరిచిపోయినానండోయ్ ... అరగంటక్రితం, యీ పుస్తకాన్ని మీకిమ్మని యిచ్చివెళ్లాడు శర్మ...తెల్లవారిరైల్లో సామర్లకోట వెడ్తాట్ట...అక్కడ ప్యాక్టరీ కంపెనీలో వుద్యోగ మేదో కాళీవచ్చిందిట..." అన్నది చిన్నీ...

చిన్నీ మాటల్ని ఆట్టే చెవిని పెట్టకుండానే, పేజీలు తిరగవేస్తుండగా, మొదలే ప్రత్యక్షమైంది దృశ్యం :—

సోమవారం, 8 వ తారీఖు :—"ఇచ్ఛాశీవుల" మొదటిమీటింగు: హాజరు: శాస్త్రి, కౌండిన్య, చౌదరీ, భూషన్, సెక్రటరీహోదాలో శర్మ...సంభాషణ కాలం: రెండుగంటలు, పర్యవసానం: నిల్.

ఖర్చు :—

ఆరుకప్పుల టీ 0-6-0, 1 గోల్డుఫ్లేక్ సిగరెట్ టిన్ను 1-1-0

మంగళవారం, 9 వ తారీఖు :—రెండోమీటింగు...స్థలం: మొదటిరోజు కాలువగట్టే, హాజరు : అంతాను. విషయం, "నాయకుడు" సంభాషణకాలం, గంటన్నర...పర్యవసానం...రికార్డు చెయ్యవలసినంత ముఖ్యమైంది ఏమీ లేదు...

ఖర్చు :—

ఎనిమిదికప్పుల టీ 0-8-0, రెండు సిగరెట్ టిన్నులు 2-2-0

బుధవారం, 10 వ తారీఖు :— మూడోమీటింగు: మామూలుస్థలం, మామూలు సభ్యులు...

విషయం "నాయిక" సంభాషణ, రెండున్నర గంటలు. పర్యవసానం, తీవ్రమైన వాద ప్రతివాదాలు, తుదకు తేలింది, నాయిక తనకుకావలసిన సరుకులన్నీ "కామ్రేడ్సు అండ్ కో"లో కొనేటట్టు ఏర్పాటు.

ఖర్చు :—

ఎనిమిదికప్పుల టీ 0 8-0, టిన్నులు 2, ప్యాకెట్లు 3, సిగరెట్లు 2-9-0

గురువారం, 11 వ తారీకు:-నాలుగోమీటింగు, స్థలం-మంగినపూడి సముద్రతీరం, హాజరు - అందరూ, విషయం, రెండు, "గా" లను గూర్చి, అంటే "గ్రాంధికమా, గ్రామ్యమా" అని. పాడబడ్డపాటలు: శర్మ 1 చౌదరీ I, శాస్త్రి 1, కౌండిన్య 1, భూషణ్ (నహి) సంభాషణకాలం: టిఫిన్ అరగంట: మాటలు $\frac{3}{4}$ గంట, నిశ్శబ్దం- మొత్తంమీద 25 నిమిషాలు. పర్యవసానం:- ఏమీ లేదని నా అభిప్రాయం.

ఖర్చు:—చౌదరీ కోర్కెపై ఏర్పాటుచేయబడ్డ టిఫిన్‌కు 3—6—9, మామూలు టీ 0—8—0, కిళ్లీలు 0—3—3, కౌండిన్య కోర్కెపైన ఎక్కువగా తెచ్చిన టిన్‌లు మామూలు 2, పైనమరొకటి వెరశి 3 3—3—0, శాస్త్రి సలహాప్రకారం ఏర్పాటు చేయబడ్డబస్సుకు రానుపోను 8—0—0, డిట్టో డ్రైవరుకు యినాం 1—0—0, డిట్టో క్లీనరుకి 0—8—0.

గురువారం, రాత్రి 7 గం:--అయిదో మీటింగు జరుగుతుందో లేదో అనుమానం కాబట్టి, నేను రేపు ఉద్యోగప్రయత్నంకోసం సామర్లకోట పోతున్నాను కాబట్టి యీపుస్తకం భూషన్‌కు దాఖలు చేసుకోడం అయింది...

డి. స. శర్మ...

11—11—35.

పరా:—పైన వివరించిన బిల్లులన్నీ...అరువు తేబడ్డవి కాబట్టి, వాటి తాలూకు బిల్లులు, (అంతా

వెరశి మొత్తం రు. 23—1—0, అక్షరాలా ఇరవై మూడు రూపాయల ఒక్క అణా మాత్రమే) విడివిడిగా భూషణ్‌కు పంపవలసిందని దుకాణదార్లకి చెప్పడమైంది.

రెండో షరా:—నేను చేసిన చాకిరీకి "ఇచ్ఛాజీవుల" కనుక యిష్టపడి థాంక్సుతీర్మానాన్ని ప్యాసు చేస్తే దాన్ని నేను నాసరియైన ఎడ్రసు తెల్పేటంతవరకూ భూషణ్ వద్దనే వుంచమని మనవి...

మూడో షరా:—తొందరలో ఏవైనా శీర్షికలు యాల్ని మినిట్సులో వ్రాయడంలో మరచివున్నట్టయితే అవేవో నాకు తెల్పితే తీరికవున్నప్పుడు వ్రాసి దాఖలు చేసుకుంటాను...

నాలుగో షరా:—మొదలు చేసిన వాగ్దానం ప్రకారం "ఇచ్ఛాజీవుల" మీటింగుల రహస్యాలు ఎవరితో చెప్పనని తిరిగి నొక్కి వక్కాణిస్తున్నాను...

డి. స. శ. వ్రాలు


# జెనిత్ ద్రాక్షాసవ

ఆయుర్వేద శాస్త్రీయ పద్ధతులమీద తయారు కాబడినది

ఆరంభదశలో నున్న క్షయరోగము, ఉబ్బసము, శ్వాసనాళీ దాహము, ఊపిరితిత్తులకు సంబంధించిన యితర వ్యాధులు, శీతలము, పడిసెము, మందాగ్ని, అజీర్తి, మలబద్ధకము, కడుపు పులియుట, వాంతులు వచ్చునట్లుండుట అన్ని విధములగు గొంతువ్యాధులు మున్నగు జాడ్యములను ఇది పూర్తిగా కుదుర్చును. పిల్లలదగ్గులను పోగొట్టుటలో అద్వితీయ మైనది. త్రాగుటకు మధురముగా నుండును. క్రమముగా సేవించినచో, ప్రేగులను శుభ్రముగా నుంచి, ఆకలిని వృద్ధిజేయును. జెనిత్ ద్రాక్షాసవమును రాత్రివేళ పరుండక మునుపు పుచ్చుకొనిన సుఖనిద్ర నిచ్చును. ఉదయమున మేల్కాంచినంతనే తమపనులయం దాసక్తులై చురుకుగా నుందురు.

"జెనిత్ ద్రాక్షాసవము" ఇప్పుడు ప్రతినగరములోను, పల్లెలందును గల దుకాణములలో దొరకును. తపాల ద్వారా సీసాల నంపుటచే మిగుల వ్యయ మగును గాన మా ఖాతాదార్లు వారి గ్రామములో గల దుకాణములందే "జెనిత్" ద్రాక్షాసవమును కొనినచో వీలుగా నుండుటేకాక లాభకరముగాగూడ నుండును.

వెల 1½ పౌను రు. 1-12-0. 1 పౌను రు. 1-4-0. ½ పౌను రు. 0-12-0. ప్యాకింగ్ వి. పి. ఖర్చులు ప్రత్యేకము.

ఆంధ్రజిల్లాల యేజంట్లు:—

ఉపేంద్ర అండు కో., గుంటూరు.

**Zenith Chemical Works,**

Dekaran mansions, Princess St., Bombay No. 2.